# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 14-06-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడు దేశాల పర్యటనలో భాగంగా రేపు సైప్రస్ వెళ్లనున్నారు.
- ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరిపేందుకు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశామని కేంద్ర మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు.
- దేశానికి విద్య సురక్షితమైన భవిష్యత్తును అందిస్తుందని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు.
- వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన NEET UG-2025 పరీక్ష ఫలితాలను NTA విడుదల చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడు దేశాల విదేశీ పర్యటనలో భాగంగా రేపు సైప్రస్ కు వెళ్లనున్నారు. సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడొలిడెస్ ఆహ్వానం మేరకు, ప్రధానమంత్రి రేపు సైప్రస్ లో అధికారికంగా పర్యటించనున్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత ప్రధానమంత్రి చేస్తున్న తొలి విదేశీ పర్యటన ఇది. నికోసియాలో సైప్రస్ అధ్యక్షుడితో చర్చలు జరపడంతో పాటు లిమాసోల్‌లో పలు వాణిజ్య సంస్థల ప్రతినిధులను ఉద్దేశించి ప్రధానమంత్రి ప్రసంగిస్తారు. ద్వైపాక్షిక సంబంధాలను మరింతగా పెంచుకోవడానికి, మధ్యధరా ప్రాంతం, యూరోపియన్ యూనియన్‌తో భారతదేశ నిబద్ధతను బలోపేతం చేయడానికి ఈ పర్యటన పునరుద్ఘాటిస్తుంది.
అలాగే.. కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ ఆహ్వానం మేరకు ప్రధానమంత్రి జూన్ 16న G-7 శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు కెనడా వెళతారు. అనంతరం.. జూన్ 18న క్రొయేషియాలో నరేంద్ర మోదీ పర్యటిస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరిపేందుకు ఐదుగురు నిపుణులతో కూడిన ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశామని పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈరోజు న్యూఢిల్లీలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. కమిటీ మూడు నెలల్లో నివేదిక అందిస్తుందని చెప్పారు. ఈ సంఘటనపై దర్యాప్తును పరిశీలించేందుకు వివిధ రంగాలకు చెందిన నిపుణుల కమిటీ కూడా ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వివరించారు. ఈ కమిటీకి హోం కార్యదర్శి చైర్మన్‌గా ఉంటారని చెప్పారు. సోమవారం ఈ కమిటీ సమావేశం అవుతుందని, దీని నివేదిక ఆధారంగా అవసరమైన తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. భారత్ లో ప్రస్తుతం ఉన్న 34 బోయింగ్ 787 విమానాలను తనిఖీ చేయాలని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (DGCA) ఆదేశించిందని మంత్రి చెప్పారు. అదే విధంగా హోం సెక్రటరీ ఆధ్వర్యంలో మరొక కమిటీని కూడా నియమించామని రామ్మోహన్ నాయుడు వెల్లడిస్తూ...

(వాయిస్ బైట్...35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన NEET UG-2025 పరీక్ష ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA) ఈరోజు విడుదల చేసింది. రాజస్థాన్‌కు చెందిన మహేష్ కుమార్ ఈ ఫలితాలలో మొదటి స్థానం దక్కించుకోగా, మధ్యప్రదేశ్‌కు చెందిన ఉత్కర్ష్ అవధియా, మహారాష్ట్రకు చెందిన క్రిషాంగ్ జోషి వరుసగా రెండు, మూడవ స్థానాలలో నిలిచారు. అధికారిక వెబ్‌సైట్ - ntaneet.nic.in లో అభ్యర్థులు తమ స్కోర్ కార్డును డౌన్‌లోడ్ చేసుకుని, మెరిట్ జాబితాను పరిశీలించుకోవచ్చునని NTA తెలిపింది. కాగా.. మే 4వ తేదీన దేశ వ్యాప్తంగా జరిగిన నీట్ యూజీ పరీక్షకు 22 లక్షల మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశానికి విద్య సురక్షితమైన భవిష్యత్తును అందిస్తుందని కేంద్ర విద్యా శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. ఈరోజు మహారాష్ట్రలోని ముంబైలో జరిగిన కార్యక్రమంలో ఐదు విదేశీ విశ్వవిద్యాలయాలకు లెటర్ ఆఫ్ ఇంటెంట్ (LOI) మంజూరు చేసే కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. నేడు ప్రపంచం భారతదేశాన్ని ఒక గమ్యస్థానంగా మాత్రమే కాకుండా, జ్ఞాన భాగస్వామిగా చూస్తోందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విక్షిత్ భారత్ ప్రయాణంలో ఒక మైలురాయిగా ఆయన అభివర్ణించారు. మహారాష్ట్ర నేడు విద్యా రంగంలో కూడా అగ్రగామిగా కొనసాగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్రిటన్, ఆస్ట్రేలియా, అమెరికా దేశాలు మహారాష్ట్రలో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడానికి లెటర్స్ ఆఫ్ ఇంటెంట్స్ ను మంజూరు చేశారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ..

(వాయిస్ బైట్..38 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కైలాస్ మానస్ సరోవర్ యాత్రలో పాల్గొనే యాత్రికుల మొదటి బృందం రేపు సిక్కింలోని గ్యాంగ్ టక్ చేరుకుంటుంది. వీరికి అవసరమైన ఏర్పాట్లను ఆ రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేసింది. ఐదు సంవత్సరాల విరామం తరువాత ఈ నెల 20న కైలాస మానస సరోవర యాత్ర ప్రారంభం కానుంది. కేంద్ర పర్యాటక, పౌర విమానయాన శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సి.ఎస్.రావు ఆకాశవాణితో మాట్లాడుతూ.. అధికారులతో పాటు 35 మంది యాత్రికులు ఉన్న ఈ బృందంలో మొదటి బ్యాచ్ రేపు వస్తుందని తెలిపారు. ఈనెల 20న నాథులా వద్ద సిక్కిం రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమంగ్ ఈ యాత్రను ప్రారంభిస్తారు. యాత్ర పూర్తి కావడానికి ప్రతీ బృందానికి 11 నుంచి 12 రోజులు సమయం పడుతుందని వెల్లడించారు. ఈ సంవత్సరం నాథులా ద్వారా కైలాస మానస సరోవర యాత్రకు మొత్తం పది బృందాలు వెళ్లనున్నాయని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ శ్రేయస్సు కోసం భారతదేశ ఆకాంక్షను యోగా సూచిస్తుందని ఆయుష్ శాఖా మంత్రి ప్రతాప్ రావు జాదవ్ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన గ్లోబల్ యోగా సమ్మిట్ - యోగా కనెక్ట్ అనే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా మానవాళి నేడు పలు సవాళ్లను ఎదుర్కొంటోందని చెప్పారు. ప్రపంచ శాంతి కోసం భారతదేశం అందించే ఒక బహుమతిగా యోగా నిలుస్తుందని, ఇది వారసత్వ సంపద అని పేర్కొన్నారు. మతం, లింగం, భాషా సరిహద్దులను యోగా అధిగమిస్తుందని, పిల్లల నుండి వృద్ధుల వరకు, పేదల నుండి సంపన్నుల వరకు అందరికీ అందుబాటులో ఉంటుందని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ బైట్...40 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పహల్గామ్ ఉగ్రవాద దాడులు, ఆపరేషన్ సిందూర్, అనంతరం ఏడు పార్లమెంటరీ ప్రతినిధుల బృందం నేతృత్వంలో చేపట్టిన దౌత్యపరమైన చర్యలు, ప్రపంచ వేదికపై భారతదేశ గళాన్ని వినిపించాయని బిజెపి సీనియర్ నాయకులు రవిశంకర్ ప్రసాద్ అన్నారు. పాట్నాలో ఈరోజు పాత్రికేయ సమావేశంలో మాట్లాడుతూ, 140 కోట్ల మంది భారతీయుల ప్రయోజనాల కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజకీయ పార్టీలకు అతీతంగా పార్లమెంటు సభ్యులతో అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ దౌత్యపరమైన కార్యక్రమంతో భారతదేశం ఉగ్రవాదం పట్ల తన వైఖరిని, ఉగ్రవాదం నుండి తమ దేశ పౌరులను రక్షించుకునే హక్కును ప్రపంచ వేదికలపై వివరించిదని తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శాసన వ్యవస్థలో పారదర్శకత కోసం సాంకేతికతను స్వీకరించే దిశగా ఈ-విధాన్ ప్రాజెక్ట్ ఒక ప్రశంసనీయమైన అడుగని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు అన్నారు. ఈరోజు ఢిల్లీ అసెంబ్లీలో ఈ-విధాన్ (కాగిత రహిత అసెంబ్లీ) కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కిరెన్ రిజిజు మాట్లాడుతూ... అనేక రాష్ట్రాలు ఇప్పటికే ఈ-విధాన్ వ్యవస్థను విజయవంతంగా అమలు చేశాయని అన్నారు. ఈ-విధాన్ కేవలం కాగిత రహితంగా మారడం గురించి మాత్రమే కాకుండా, శాసన ప్రక్రియలలో పారదర్శకత, ప్రజల భాగస్వామ్యం, సామర్థ్యం, డిజిటల్ భద్రతను పెంపొందిస్తుందని చెప్పారు.

==============================

ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్-2025 టైటిల్ ను దక్షిణాఫ్రికా కైవసం చేసుకుంది. లండన్ లోని లార్డ్స్ వేదికగా దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగిన ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ మ్యాచ్ లో నాల్గవ రోజు 5 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాపై విజయం సాధించింది. దీంతో సుదీర్ఘ నిరీక్షణ తరువాత దక్షిణాఫ్రికా జట్టు ఐసిసి ట్రోఫీని గెలుచుకుంది.

==============================

==============================